

గ్యాంగ్‌ల భరతం పడతాం

జిల్లాలో గ్యాంగుల పేరుతో రౌడీయిజం, దౌర్జన్యాలకు పాల్పడే వారి భరతం పడతామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాస్ వార్నింగ్ ఇచ్చారు. -8లో



గిట్టుబాటు ధర కరువై..

లక్షలు ఖర్చుపెట్టి పంట సాగు చేస్తే చేతికి అందే సమయంలో దళారుల సిండికేట్‌తో అమ్ముడుపోక తోటలోనే కాయలు వదిలేసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.130	రూ.160
రెండోరకం	రూ.60	రూ.120

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 126 మెట్రిక్ టన్నులు



సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో శుక్రవారం సాయంత్రం సీతారామ కల్యాణం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని పరిపాలన భవనం సమావేశం హాల్‌లో చైర్మన్, ఈఓ జె. శ్యామలరావు, వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేఈఓ వీరబ్రహ్మం, వైఎస్సార్ జిల్లా జేసీ అదితిసింగ్, ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, సీవీఎస్ఓ హర్షవర్ధన్ రాజుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సీతారాముల కల్యాణం సందర్భంగా శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. కల్యాణ వేదిక వద్ద ఉన్న 147 గ్యాలరీల్లో 60 వేల మంది కూర్చొని వీక్షించేందుకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తలంబ్రాల పంపిణీకోసం తొలిసారిగా 28 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.ఎస్వీబీసీ చానల్‌లో స్వామివారి కల్యాణం నేరుగా ఎల్‌ఈడీ స్క్రీన్ మీద ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశామని తెలియజేశారు.

బాంబు స్క్వాడ్ తనిఖీలు

సిద్దవటం: మండలంలోని కనుమలోపల్లె,భాకరాపేట, శివునిపల్లె, బొగ్గిడివారిపల్లె, చాముండేశ్వరీపేట, మాధవరం-1 ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్ పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఒంటిమిట్టలో ఈ నెల 11న జరిగే సీతారాముల కల్యాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వస్తున్నారు. ఈ నేపథ్యంలో కడప జేఎంజే కళాశాల నుంచి ఒంటిమిట్ట వరకు రోడ్డుకు ఇరువైపులా చెత్తకుప్పలు, కల్వర్టులు, అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేశామని బాంబుస్క్వాడ్ పోలీసులు తెలిపారు.

రారండోయ్.. వేడుక చూద్దాం

- నేడు పండు వెన్నెల్లో కోదండరాముని పరిణయం
- సిద్ధమైన ఒంటిమిట్ట



విద్యుద్దీపాలంకరణలో శ్రీ కోదండ రామాలయం

కడప కల్చరల్/రాజంపేట: దేశంలో ఎక్కడా లేని అరుదైన సంప్రదాయం ఒంటిమిట్ట కోదండరామాలయంలో ఉంది. మిగతా అన్నిచోట్ల సీతారామ కల్యాణాన్ని పగటిపూట నిర్వహిస్తారు. కానీ ఒంటిమిట్టలో మాత్రమే రాత్రి పూట జరుపుతారు. ఇలా వెన్నెల్లో సాక్షాత్తు చందమామ సాక్షిగా సీతారామ కల్యాణం నిర్వహించడం ఈ ప్రాంతానికి ఉన్న విలక్షణమైన సంప్రదాయం. ఈ నెల11న జరిగే కల్యాణోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించనున్నారు. 2014లో ఈ ఆలయాన్ని టీటీడీ తన పరిధిలోకి తీసుకునేంత వరకు ఆలయ రాజ (తూర్పు) గోపురం మెట్లపైనే కల్యాణం నిర్వహించేవారు. 2015 నుంచి గ్రామం వెలువల నిర్వహించడం ప్రారంభమైంది.

బుక్కరాయల పాలనలో..

వాల్మీకి రామాయణం ప్రకారం త్రేతాయుగంలో చైత్ర మాసం పూర్ణిమకు ముందు ఫల్గుణి నక్షత్రంలో కల్యాణోత్సవం నిర్వహించారు. బుక్కరాజు 1356లో ఈ ఆలయాన్ని పునరుద్ధరించాక తొలిసారి బ్రహ్మోత్సవాలను నిర్వహించడం మొదలైంది. ఆ సంవత్సరంలో ఫల్గుణి నక్షత్రం రాత్రిపూటే రావడంతో నాడు బుక్కరాయలు స్వామి కల్యాణాన్ని రాత్రిపూటే నిర్వహించారని చరిత్రకారుల సమాచారం. ఆ తర్వాత ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల్లో అదే సంప్రదాయం కొనసాగుతోంది. ఇతర ప్రముఖ రామాలయాల్లో రాముడు పుట్టినరోజున వివాహం నిర్వహిస్తుండగా, ఒంటిమిట్టలో మాత్రం త్రేతాయుగంలో రామయ్య కల్యాణం జరిగిన నక్షత్రంలోనే కల్యాణం నిర్వహిస్తున్నారు.

ఆలయ ప్రాంగణం నుంచి.. ఆరుబయలు వరకు

ఒంటిమిట్ట ఆలయం టీటీడీ పరిధిలోకి వెళ్లాక స్వామి కల్యాణాన్ని ఆలయానికి కొద్ది దూరంలో నిర్వహించడం ప్రారంభించారు. హాజరయ్యే భక్తుల సంఖ్యకు తగినట్లుగా గ్రామం వెలుపల కల్యాణం చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. వెన్నెల్లో రామచంద్రుని సాక్షిగా జరగాల్సిన కల్యాణాన్ని కల్యాణ వేదిక చుట్టూ పందిళ్లు వేయడంతో చంద్రుని చూసే అవకాశం లేదని భక్తులు అప్పటి నుంచి అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఈ విషయంగా అసంతృప్తిని తెలుపుతూ జిల్లాకు చెందిన చరిత్రకారులు, భక్త ప్రముఖులు టీటీడీ, రాష్ట్ర అధికారులకు వినిపత్రాన్ని అందజేస్తూ వచ్చారు. మొత్తానికి ప్రస్తుతం ఈ దిశగా అధికారులు స్పందించారు. స్థానిక భక్తుల సెంటిమెంటును గౌరవిస్తూ ఆరుబయట కల్యాణం నిర్వహిస్తూ వస్తున్నారు.

చంద్రుని కోరికపై..



ఒంటిమిట్ట రామయ్య కల్యాణోత్సవానికి సంబంధించి మరో పురాణ గాథ జనంలో ఉంది. దాని ప్రకారం శ్రీరాముని జననం పగలు జరిగింది. ఆయన భువిపై ఉదయించే అద్భుతమైన సన్నివేశాన్ని తిలకించలేకపోయానని చంద్రుడు బాధపడ్డాడు. శ్రీకృష్ణావతారంలో తాను ఉదయించే దృశ్యాన్ని తిలకించే అవకాశాన్ని ప్రసాదిస్తానని రాముడు చంద్రునికి వరమిచ్చాడు. అప్పటి నుంచి రాముడు రామచంద్రుడయ్యాడు. రాముని కల్యాణం పగలు జరగడంతో ఆ దృశ్యాన్ని చూసే అదృష్టం లభించలేదని విచారిస్తున్న చంద్రునికి ఒంటమిట్టలో రాత్రి పూట కల్యాణం జరుగుతుందని, దాన్ని తిలకించవచ్చని రాముడు మాట ఇచ్చాడు. అప్పటి నుంచి ఒంటిమిట్టలో చంద్రుని సాక్షిగా వెన్నెల్లో రామయ్య కల్యాణం నిర్వహిస్తున్నారు.

గోటితో ఒలిచిన తలంబ్రాలు అందజేత

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో శుక్రవారం జరగనున్న సీతారాముల కల్యాణానికి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కళ్యాణ అప్పారావు ఆధ్వర్యంలో గోటితో ఒలిచిన తలంబ్రాలను సమర్పించారు. సూపరిటెండెంట్ హనుమంతయ్య అర్చకులు శ్రావణ్ కుమార్ సమక్షంలో వీటిని అందించారు. తలంబ్రాల కోసం మూడునెలలపాటు వరిని ప్రత్యేకంగా పండించి ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఢిల్లీ రాష్ట్రాలకు చెందిన భక్తులు భక్తిభావంతో మూడు నెలలపాటు గోటితో ఒలిచి సిద్ధం చేశారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



నేడు సీఎం రాక

కడప సెవెన్‌రోడ్స్: ఒంటిమిట్ట కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జరగనున్న కల్యాణోత్సవానికి సీఎం చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. సాయంత్రం 3.35 గంటలకు విజయవాడ నుంచి విమానంలో బయలుదేరి 4.20కి కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 4.30కి అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 5 గంటలకు ఒంటిమిట్టలోని టీటీడీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 6.30కి అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 6.35కు కల్యాణ వేదిక ఆవరణానికి చేరుకుంటారు. 6.45 నుంచి 8.30 వరకు కల్యాణోత్సవంలో స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారు. సీతారామ కల్యాణోత్సవాన్ని తిలకించిన తర్వాత 8.35కి రోడ్డు మార్గాన బయలుదేరి 8.40 గంటలకు టీటీడీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని ఆ రాత్రి అక్కడే బస చేస్తారు. మరుసటిరోజు ఉదయం 8.50 గంటలకు రోడ్డుమార్గాన బయలుదేరి 9.20 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 9.30 గంటలకు అక్కడి నుంచి విమానంలో బయలుదేరి విజయవాడ వెళతారు.

కొనసాగుతున్న సంప్రదాయం



బుక్కరాయలకాలం నుంచి రాత్రి పూటే తొలి సీతారాముల కల్యాణ మహోత్సవం జరిగింది. నాటి నుంచి నేటి దాకా అదే సంప్రదాయం కొనసాగుతోంది. కళాపూర్ణుడైన చంద్రుడు సీతారామ కల్యాణాన్ని పరమానందతో తిలకిస్తాడు..ఒంటిమిట్టలో శ్రీరామకళ్యాణం తిలకించే ఏర్పాటుచేసింది బ్రహ్మదేవుడుకాదు.. శ్రీ మహావిష్ణువు అని కూడా పురాణాలు చెబుతున్నాయి. -వీణారాఘవచార్యులు, ప్రధానఅర్చకులు, రామాలయం, ఒంటిమిట్ట

న్యూస్‌రీల్

14న అంబేడ్కర్ జయంతి వేడుకలు

రాయచోటి జగదాంబసెంటర్: రాయచోటి పట్టణం మాసాపేట మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న సాయిశుభ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 14వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి జయప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.


దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట టౌన్: నేషనల్ ట్రేడ్ టెస్ట్ సర్టిఫికెట్ పొందేందుకు వివిధ ట్రేడ్‌లలో నైపుణ్యం కలిగి, ప్రైవేట్ కంపెనీల్లో పనిచేస్తున్న అభ్యర్థులు ఈనెల 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్ రఘురామిరెడ్డి తెలిపారు. రాజంపేటలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఇస్తున్న కంపెనీలు, ఎంఎస్ఎంఈలు రిజిస్టర్ ఎస్టాబ్లిష్మెంట్ కనీసం ఏడాది నంచి మూడేళ్ల అనుభవం కలిగిన అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. అర్హులైన వారు తమకు సమీపంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 98494 97639 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు

రాయచోటి జగదాంబసెంటర్: స్వయం ఉపాధి పథకాలకు అర్హులైన షెడ్యూల్డ్ కులాల వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకారం సంఘం కార్యనిర్వాహక సంచాలకులు జి.రాజ్యలక్ష్మీ తెలిపారు. అర్హులైన వారు ఆధార్, రేషన్‌కార్డు/ ఆదాయ ధృవీకరణ సర్టిఫికెట్, మీ సేవా కేంద్రం ద్వారా తీసుకున్న కులధృవీకరణపత్రం, విద్యార్హతలు తదితర సర్టి ఫికెట్లు తీసుకొని https://apobmms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 14 నుంచి మే 10వ తేదీ వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డీఎస్పీ కొండయ్యనాయుడు సీఐడీకి బదిలీ



మదనపల్లె: మదనపల్లె సబ్ డివిజనల్ పోలీస్ అధికారి(ఎస్‌డీపీఓ) డి.కొండయ్యనాయుడిని సీఐడీ విభాగానికి బదిలీ చేశారు. గురువారం డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా డీఎస్పీ బదిలీలకు సంబంధించి విడుదల చేసిన ఉత్తర్వుల్లో మదనపల్లె డీఎస్పీ స్థానంలో భీమవరం ఎస్‌డీపీఓగా పనిచేస్తున్న ఎస్.మహేంద్రను నియమించారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న డి.కొండయ్యనాయుడును సీఐడీ డీఎస్పీగా బదిలీచేశారు.

బ్రహ్మోత్సవం.. నయనమనోహరం





మోహినీ అలంకారంలో భక్తులకు అభయమిస్తున్న ఒంటిమిట్ట కోదండ రాముడు, గరుడ వాహన సేవలో భక్తజన సందడి

- మోహినీ అలంకారంలో జగన్మోహనాకారుడు
- వైభవంగా గరుడవాహనసేవ

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం మోహినీ అలంకారంలో స్వామివారు జగన్మోహనాకారుడిగా దర్శనమిచ్చాడు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులు కర్పూరహారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఉదయం 11 నుంచి 12 వరకు ఆలయంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ జరిగింది. అనంతరం రాత్రి 7 గంటల నుంచి గరుడ సేవ ఘనంగా జరిగింది. రామయ్య పుర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కళాకారుల కోలాటాలు, చెక్కభజనల మధ్య కోదండ రాముడి ఊరేగింపు కనులపండువగా సాగింది. ఈ కార్యక్రమం టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు ఆధ్వర్యంలో జరిగింది. గురువారం సీతారాముల కళ్యాణం జరుగుతున్న నేపథ్యంలో దాశరథి దివ్యక్షేత్రాన్ని రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు: బ్రహ్మోత్సవాల్లో ఆరోరోజు శుక్రవారం ఉదయం 7:30 నుంచి 9:30 గంటల వరకు శివధనుర్భంగాలంకారం, 11 నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం. సాయంత్రం 3:15 నుంచి 5 గంటల వరకు ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 6:30 నుంచి 8:30 వరకు కల్యాణోత్సవం, 9:30 నుంచి 10:30 వరకు గజవాహనం, 11 నుంచి 11:15 గంటలకు ఏకాంత సేవ నిర్వహిస్తారు.

రాయితీ పథకాలతో ఆర్థికాభివృద్ధి

కలెక్టర్ చామకూరి శ్రీధర్

బి.కొత్తకోట: భవిష్యత్ సాగు పరిస్థితులకు అనుగుణంగా రైతులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం ఆయన బి.కొత్తకోట మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉద్యాన పంటల సాగు స్థితిగతులపై తెలుసుకునేందుకు స్వయంగా గులాబీ, టమాట సాగు చేస్తున్న పొలాల్లోకి వెళ్లారు. కూలీలతో ముచ్చటించారు. మొదట బీరంగి గ్రామం కర్ణాటక సరిహద్దులో నాలుగు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకం కింద రూ.40 లక్షల పెట్టుబడితో సాగు చేస్తున్న గులాబీతోటను పరిశీలించారు. తోటలో మొక్కలను పరిశీలించి మొగ్గలకు తొడిగిన కవర్లను పరిశీలించారు. తోటనిర్వహణ చూస్తున్న వారితో మాట్లాడారు. గులాబీ పంట దిగుబడితో సంబంధం లేకుండా మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పూలను ఎగుమతి చేస్తామని, ధరలు ఆశాజనకంగా ఉంటే ఏడాది పొడవునా పూలను మార్కెటింగ్ చేస్తున్నట్టు కలెక్టర్‌కు వివరించారు. దిగుబడికి సంబంధించి ప్రస్తుతం ఉష్ణోగ్రత 30 డిగ్రీలకు మించడంతో పూల దిగుబడిపై ప్రభావం చూపిస్తోందని, దీనికితోడు మార్కెట్ లేకపోవడంతో మొగ్గలను తుంచేస్తున్నామని వివరించారు. ఎగుమతి చేస్తున్న గులాబీకి మంచి మార్కెటింగ్‌తో ఆదాయం లభిస్తుందని చెప్పగా కలెక్టర్ ఇక్కడ పని చేస్తున్న బిహారీ కూలీల జీవనంపై ఆరా తీశారు. అక్కడినుంచి మోడల్ స్కూల్ వద్ద మల్చింగ్‌తో సాగవుతున్న టమాట, మిరప పంటలను కలెక్టర్ పరిశీలించారు.

- జిల్లాలో ఉద్యాన పంటల పెంపకం విస్తీర్ణం పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ మోహమ్మద్ అజారుద్దీన్, ఎంపీడీఓ దిలీప్‌కుమార్, ఆర్ఐ వీరాంజనేయులు, వీఆర్ఓల ఉన్నారు.
- ప్రజల నుంచి పీజీఆర్ఎస్‌కు అందే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని కలెక్టర్ చ.శ్రీధర్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన అప్పటికప్పుడు వ్యవసాయ, హౌసింగ్, హార్టికల్చర్, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖలవారీగా వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆక్రమిత స్థలాలను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణ కోసం చర్యలు చేపట్టాలన్నారు.



గులాబీతోటలో మొగ్గకు తొడిగిన కవర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

హామీలే.. ఏమీలే..

- అధికారంలోకి వచ్చి పదినెలలనైనా హామీల అమలులో కనిపించని పురోగతి
- జిల్లాలో పడకేసిన అభివృద్ధి
- నేడు ఒంటిమిట్టకు సీఎం చంద్రబాబు రాక

సాక్షి రాయచోటి: 2014 నుంచి 2019 వరకు చంద్రబాబే సీఎం. అప్పట్లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరులకు ఎన్నో హామీలు ఇచ్చి ఆశలు రేకెత్తించినా అతీగతీ లేదు. తర్వాత 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు పునర్విభజనతో ఏర్పడిన అన్నమయ్య జిల్లాకు ప్రతిపక్ష నేత హోదాలో అనేక హామీలు ఇచ్చారు. అందరికీ అన్నీ చేస్తాం...అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలు నేటికీ నెరవేరలేదు. నేడు ఒంటిమిట్టకు సీఎం చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్నెన్నో హామీలు..అన్నిటికీ నాదే బాధ్యత అంటూ చెప్పిన మాటలను ప్రజలు గుర్తు చేస్తున్నారు. అధికార పగ్గాలు చేపట్టి పది నెలలు దాటుతున్నా అభివృద్ధి ముందుకు కదల్లేదు. రాయచోటి, మదనపల్లె, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో పర్యటించిన చంద్రబాబు ప్రతిపక్ష నేత హోదాలో అధికారంలోకి రాగానే రూపురేఖలు మారుస్తామని చెప్పినా ఆచరణలో మాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదని మేధావులు అభివర్ణిస్తున్నారు.

ఉద్యాన హబ్ కోసం తప్పని ఎదురుచూపులు


అన్నమయ్య జిల్లాలో రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లెప్రాంతాల్లో మామిడితోపాటు అరటిని అధికంగా సాగు చేస్తారు. ఎన్నికలకు ముందు అప్పటి మాజీ సీఎం చంద్రబాబు రైల్వేకోడూరులో ఉద్యాన హబ్ ఏర్పాటు చేసి పండ్ల తోటల రైతుల సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చారు. ఇది కూడా అమలుకు నోచుకోలేదు. అలాగే పండ్ల రసాల ఫ్యాక్టరీని కూడా పునరుద్ధరిస్తామని చెప్పినా నేటికీ అతీగతి లేదు.

జిల్లా కేంద్రంలో పడకేసిన అభివృద్ధి

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో అభివృద్ధి పడకేసింది. దాదాపు 80-90 శాతం పనులు పూర్తయినా ఆయా పనులను ఇప్పటికీ పూర్తి చేయలేదు. అలాంటి వాటిని పూర్తి చేసి వినియోగంలోకి తెస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. కానీ వైఎస్సార్‌సీపీ సర్కార్‌కు పేరొస్తుందన్న ఆలోచనతో వాటిని నిర్లక్ష్యం చేయడంపై ప్రజల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మదనపల్లె మెడికల్ కళాశాలపై నీలి నీడలు

జిల్లాలోని ప్రధాన వాణిజ్య నగరమైన మదనపల్లె అభివృద్ధికి చాలా హామీలు ఇచ్చినా అమలు దిశగా అడుగులు పడటం లేదు. వైఎస్ జగన్ సర్కార్ మదనపల్లెకు మెడికల్ కళాశాల మంజూరు చేసి భవనాలు కూడా నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభించాలని ఏర్పాట్లు చేసినా అధికారంలోకి వచ్చిన తర్వాత సీట్లను కూడా కేటాయించకపోవడంతో కళాశాలపై నీలినీడలు అలుముకున్నాయి.అంతే కాదు ప్రస్తుతమున్న పెద్దాస్పత్రిని కూడా ప్రైవేటు పరం చేస్తున్నారని ప్రత్యేకంగా ఆందోళనలు కూడా చాలారోజులు కొనసాగాయి.



వరదలకు కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు (ఫైల్)



కలగా మారుతున్న అన్నమయ్య ప్రాజెక్టు

జిల్లాలో భారీ వర్షాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీటి ప్రవాహానికి పింఛాతో పాటు అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయాయి. అయితే అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించి టెండర్ల వరకు తీసుకొచ్చినా తర్వాత మళ్లీ అంచనాల రూపకల్పనతో ఆగింది. ఈలోపు అధికార పగ్గాలు చేపట్టిన కూటమి సర్కార్ అన్నమయ్య ప్రాజెక్టు గురించే పట్టించుకోవడం లేదు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి నష్టపోయిన గ్రామాల ప్రజలతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మమేకమైన సందర్భంలోనూ ప్రాజెక్టు గురించి చర్చించారు. ఎన్నికల ముందు రాజంపేట సభలో కూడా అన్నమయ్య ప్రాజెక్టు నిర్మిస్తాన్న హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ ప్రతిపాదనల దశ దాటలేదు.

కృష్ణా జలాలు ఎప్పుడు బాబూ!

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా చక్రాయపేట మండలం కాలేటి వాగు నుంచి తంబళ్లపల్లె వరకు తీసుకుపోయే కాలువలకు సంబంధించి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పెద్ద ఎత్తున బిల్లులు కూడా ఆగిపోయాయి. చివరి దశలో ఉన్న శ్రీనివాసపురం, ఝరికోన ప్రాజెక్టులకు నిధులు విడుదల చేసి పూర్తి చేయాల్సి ఉంది. అయితే వీటికి నిధుల కేటాయింపుకు అవరోధాలు ఉండగా, బనకచర్ల నుంచి ప్రత్యేక కాలువల ద్వారా నీరు దేవుడెరుగు అంటూ పలువురు చెవులు కొరుక్కుంటున్నారు. సంబేపల్లె మండల పరిధిలోని ఝరికోన ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం లేకపోవడంతో చుక్కనీటిని కూడా అందుకోలేని పరిస్థితిలో ఉన్నారు. చంద్రబాబు ఆ ప్రాజెక్టుపై దృష్టి సారించి ఎత్తిపోతల పథకం ద్వారా సంబేపల్లె, రాయచోటి, వీరబల్లి మండలాల్లోని చెరువులకు నీటిని అందించాల్సిన అవసరం ఉంది. అలాగే చిన్నమండెం మండల పరిధిలోని శ్రీనివాసపురం (నాగిరెడ్డి) రిజర్వాయర్ నుంచి ఏర్పాటు చేసిన కాలువ నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. అలాగే ప్రాజెక్టుకు పటిష్టమైన గేట్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఏది ఏమైనా ఎన్నికలకు ముందు చెప్పిన అనేక హామీలకు రూపు కల్పించాలని ప్రజలు చంద్రబాబు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

క్లుప్తంగా

వరిపంటపై అడవి పందుల దాడి



అడవిపందుల దాడిలో దెబ్బతిన్న వరి పంట

సుండుపల్లె : మండల పరిధిలోని సుండుపల్లె గ్రామ పంచాయతీ గుట్టకాడ బలిజపల్లెకు చెందిన నంద్యాల సిద్దయ్య వేరుశనగ పంట పొలంపై బుధవారం రాత్రి సమయంలో అడవి పందులు దాడి చేశాయి. ఈ సందర్భంగా రైతు సిద్దయ్య మాట్లాడుతూ సర్వే నెంబర్ 105లో దాదాపు రెండు ఎకరాల వరిమడిని సాగు చేశానని తెలిపాడు. పంట చేతికొచ్చే సమయంలో ఇలా అడవి పందులు దాడి చేయడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.

జిల్లాలోని 268 ఆలయాలకు అర్చకుల నియామకం

రామాపురం : అన్నమయ్య జిల్లాలోని 268 దేవాలయాలకు అర్చకులను నియమించనున్నట్లు జిల్లా దేవదాయ శాఖ అధికారి విశ్వనాథ్ తెలిపారు. గురువారం మండల పరిధి బండపల్లె, సూర్యనారాయణపురంలో శ్రీ మల్లాలమ్మ తల్లి ఆలయం గువ్వలచెరువు, ఓబుల్‌రెడ్డిగారిపల్లె, యర్రమరెడ్డిగారిపల్లె, రాచపల్లె, వడ్డెపల్లె, పర్వతరెడ్డిగారిపల్లె, నల్లగుట్టపల్లె, పాతపల్లి, కర్ణపువాండ్లపల్లె గ్రామాలలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ అర్చకులు దేవాలయంలో సక్రమంగా పూజలు చేయకుండా ఉంటే అలాంటి వారిపైన ఫిర్యాదు చేస్తే తొలగిస్తామన్నారు.

చేబ్రోలు కిరణ్‌పై ఫిర్యాదు



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సుండుపల్లె : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుటుంబాన్ని దుర్భాషలాడిన ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై వైఎస్సార్‌సీపీ రాజంపేట నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు అబ్దుల్లా, మండల సోషల్ మీడియా విభాగం నాయకుడు సయ్యద్ సల్మాన్‌లు సుండుపల్లె ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. అతని వ్యాఖ్యలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల మనోభావాలను, వారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్యాంగ్‌ల భరతం పడతాం

- అసాంఘిక కార్యక్రమాలు.. అరాచకాలకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తాం
- గ్యాంగ్‌వార్ ఘటనలో తొమ్మిది మంది అరెస్టు
- మిగిలిన వారికోసం వేట
- మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



మీడియా సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో గ్యాంగుల పేరుతో రౌడీయిజం, దౌర్జన్యాలకు పాల్పడే వారి భరతం పడతామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాస్ వార్నింగ్ ఇచ్చారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. శివాలయం వద్ద జరిగిన గ్యాంగ్ వార్ కేసులో తొమ్మిది మందిని అరెస్టు చేసి కోర్టుకు పంపుతున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యక్రమాలు, అరాచకాలు, దోపిడీలకు పాల్పడిన వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. చట్ట పరిధి దాటిన వారిని ముందుగా హెచ్చరించడంతోపాటు వారికి అన్ని కోణాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అప్పటికీ దారికి రాకపోతే వారిపై రౌడీషీట్ కేసులు ఓపెన్ చేసి అవసరమైతే జిల్లా బహిష్కరణ చేయిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో జూద శాలలపై ఉక్కుపాదం మోపామన్నారు. కుల మతాలు, వర్గాల ముసుగులో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తున్న వారిపట్ల కూడా కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. ప్రధాన పట్టణాలలో నిరుద్యోగ యువకులు, మైనర్ విద్యార్థులు కొంతమంది మాయమాటలలో పడి మత్తుకు బానిసలై తప్పుదారిలో పయనిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారిపై కూడా తగు చర్యలు తీసుకోవడంతోపాటు గ్యాంగుల నిర్వాహకులపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. రంజాన్ మాసం సందర్భంగా జరిగిన సంఘటనపై కూడా ఇంకా విచారణ సాగుతోందన్నారు. అన్ని వీడియో పుటేజీలను పరిశీలించిన అనంతరం దాడుల్లో పాల్గొన్న వారందరినీ అరెస్టు చేస్తామన్నారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరిగినా తక్షణం పోలీసులు చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అందుకు అవసరమైన పోలీసులను కూడా సిద్ధం చేశామన్నారు. పట్టణాల పరిధిలో రాత్రి సమయాలలో అదనపు బలగాలతో పోలీసులు గస్తీని ఏర్పాటు చేశామని తెలిపారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం నేరమన్నారు. మైనర్లతోపాటు బైక్‌లు ఇచ్చిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా పోలీస్ దండనను ఎదుర్కోవాల్సి వస్తుందని ఎస్పీ తీవ్రంగా హెచ్చరించారు.

తొమ్మిది మంది ముద్దాయిలు అరెస్టు..

అమ్మాయి విషయంపై ఒకరిపై మరొకరు మనస్పర్థలు పెంచుకొని దాడులు చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తెలిసిందన్నారు. ఈ కారణంగానే కక్షలు పెంచుకొని శివాలయం చెక్‌పోస్టు వద్ద జరిగిన ఘర్షణ కేసులో తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. గ్యాంగ్ వార్ దాడిలో ఇరువర్గాలకు చెందిన 24 మందిని గుర్తించి రాయచోటి అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. సయ్యద్ నూరుల్లా ఉరఫ్ నూర్ (21), సయ్యద్ బైతుల్లా (23), షేక్ ఖదీర్ అహ్మద్ ఉరఫ్ ఖాదర్ (24), షేక్ సుహైల్ ఉరఫ్ గుర్రం (21), షేక్ మన్సూర్ అలీ (22), షేక్ ఇర్ఫాన్ (21), షేక్ ఇర్ఫాన్ (21), షేక్ షారుక్ (21), పఠాన్ రియాజ్ అలీఖాన్ ఉరఫ్ నాజుల్లా (22)లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పెడుతున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న 15 మందికోసం వేట సాగుతుందన్నారు. త్వరలోనే వారిని కూడా అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు. నిందితులు దాడులకు ఉపయోగించిన ఐదు కట్టెలు, మూడు ఇనుప రాడ్లు, ఒక ఇనుప చైన్, తొమ్మిది మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. మీడియా సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి, రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో జిల్లా జట్టుకు మూడో స్థానం



మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా బహుమతిని అందుకుంటున్న జిల్లా జట్టు సభ్యులు

రాయచోటి జగదాంబసెంటర్ : రాష్ట్ర స్థాయి జూనియర్స్ హాకీ పోటీలలో రాజు హాకీ అకాడమీ మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు అన్నమయ్య జిల్లా హాకీ సెక్రటరీ ఇ.నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు ధర్మవరంలో జరిగాయన్నారు. పోటీలలో రాష్ట్ర స్థాయి జూనియర్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అన్నమయ్య జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా బహుమతిని అందుకున్నట్లు చెప్పారు. అన్నమయ్య జిల్లా హాకీ జట్టును హాకీ ఫౌండర్ సి.చంద్రశేఖర్, కోచ్‌లు సుబ్బు, నారాయణ, రాజీ, రాజు విద్యాసంస్థల అధ్యాపకులు అభినందించారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

- ఒంటిమిట్ట సీతారాముల కల్యాణం నేపథ్యంలో నిర్ణయం
- వాహనదారులు పోలీసులకు సహకరించాలి
- జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : ఈనెల 11న ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం జరగనున్న నేపథ్యంలో కడప–రేణిగుంట మార్గంలో ట్రాఫిక్ మళ్లింపు కార్యక్రమం చేపట్టినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం రాయచోటిలో పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. స్వామివారి కల్యాణానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా కడప–రేణిగుంట రహదారిపై 11వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 12వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. భక్తుల వాహనాలు మినహా ఎలాంటి ఇతర వాహనాలు అనుమతించరని జిల్లా ఎస్పీ తెలిపారు.

దారి మళ్లింపు వివరాలు..

కడప నుంచి తిరుపతి వైపు వెళ్లే వాహనాలు కడప నగరం ఊటుకూరు సర్కిల్, వయా గువ్వల చెరువు, రాయచోటి మీదుగా తిరుపతి వెళ్లాలన్నారు. అలాగే తిరుపతి నుంచి కడప వైపు వెళ్లే అన్ని వాహనాలు, తిరుపతి నుంచి వయా భాకరాపేట, పీలేరు, రాయచోటి మీదుగా కడపకు చేరుకోవాలన్నారు. రైల్వేకోడూరు, రాజంపేట వైపు నుంచి కడపకు వెళ్లే వాహనాలను రాజంపేట నుంచి రాయచోటి మీదుగా దారి మళ్లింపు చేసినట్లు ఎస్పీ ఆ ప్రకటనలో తెలిపారు.

ముదివేడు నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట సీపీఎం నాయకుల ఆందోళన

రాయచోటి టౌన్ : ముదివేడు రిజర్వాయర్ నిర్వాసిత రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ కోసం రైతుల భూములు లాక్కొని వారికి పరిహారం చెల్లించకుండా, పునరావాసం కల్పించకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. పరిహారం ఇవ్వకపోతే భూములను వెనక్కి ఇవ్వాలని కోరారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీనివాసులు, రాజేష్, వెంకటరెడ్డి, మారపరెడ్డి, తిమ్మారెడ్డి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను కొల్లగొట్టారు.. చెట్లను కూల్చేశారు



రామానాయిని చెరువులో జేసీబీలతో నల్లతుమ్మ చెట్లను కూల్చివేసిన ఇసుకాసురులు



రామానాయిని చెరువులో జేసీబీలతో నీలగిరి చెట్లను వేళ్లతో సహా పెకలించివేసిన దృశ్యం

- ఇసుక కోసం జేసీబీలతో చెట్లను తొలగించిన వైనం
- రూ.లక్ష విలువ చేసే చెట్లు మాయం

గుర్రంకొండ : ఇసుకాసురులు ఎంతకైనా తెగిస్తున్నారు. చెరువుల్లో ఇసుక కోసం అడ్డుగా ఉన్న చెట్లను జేసీబీలతో పెకలించేశారు. రూ. లక్ష విలువచేసే చెట్లను చెరువులో నుంచి మాయం చేసిన సంఘటన మండలంలోని తరిగొండ గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో సుమారు 150 ఎకరాల్లో రామానాయిని చెరువు విస్తరించి ఉంది. మండలంలోని ఇది అతిపెద్ద ఇరిగేషన్ చెరువు. ఈ చెరువు నిండి మొరవ పోతే శ్రీ లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవం వైభవంగా చెరువు వద్ద నిర్వహిస్తారు. అంతటి ప్రాశస్త్యమున్న చెరువు ఇసుకాసురుల అక్రమ సంపాదనకు ఆవాసంగా మారింది. ఓవైపు వందలాది లోడ్ల ఇసుకను ఇప్పటికే అక్రమంగా తరలించకు పోగా చెరువులో ఉన్న చెట్ల పై కూడా ఇసుకాసురుల కన్ను పడింది. చెరువుల సువిశాలమైన ప్రాంతంలో పురాతన నల్లతుమ్మ, నీలగిరి చెట్లు వందల సంఖ్యలో ఉన్నాయి. వీటి మధ్యలో ఇసుక నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో ఇసుకాసురులు ఇసుక తోడేందుకు అడ్డుగా ఉన్న నల్లతుమ్మ, నీలగిరి చెట్లను జేసీబీలతో పెకలించివేశారు. చెరువులోనే మరికొన్నిచోట్ల ఇసుకను తరలించడానికి కొత్త దారుల ఏర్పాటు కోసం చెట్లను జేసీబీలతో పెకలించి పక్కన పడేశారు. కొంతమంది ఇసుకాసురులు వీటిని గుట్టుచప్పుడు కాకుండా విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బట్టీల యాజమానులకు సుమారు లక్ష విలువ చేసే నల్లతుమ్మ, నీలగిరి చెట్లను ఇప్పటికే ఇసుకాసురులు విక్రయించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. మరికొన్ని చెట్లను వేళ్లతో సహా పెకలించి చెరువుల్లో అలాగే వదిలిపెట్టేశారు. చెరువుల్లో ఎక్కడ చూసినా నేలకొరిగిన చెట్లే దర్శనమిస్తుండడం గమనార్హం. ఓవైపు ఇసుక మరోవైపు చెట్లను అక్రమంగా విక్రయిస్తూ ఇసుకాసురులు లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా చెరువులను కాపాడుకునేందుకు ఇప్పటికే వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను అక్కడ కాపలాగా ఉంచామన్నారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అన్నమాచార్య యూనివర్సిటీలో టెక్‌ఫెస్ట్ విజయవంతం



విజేతలకు ప్రశంసా పత్రం అందిస్తున్న ప్రో-ఛాన్సలర్ చొప్పా అభిషేక్ రెడ్డి

రాజంపేట : రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీలో జాతీయస్థాయిలో నిర్వహించిన రెండు రోజుల సాంకేతిక సాంస్కృతిక మహోత్సవం (టెక్‌ఫెస్ట్–2025) గురువారం విజయవంతంగా ముగిసింది. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కాలేజ్, పులివెందుల ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ద్వారా ఆత్మవిశ్వాసాన్ని, పోటీతత్వాన్ని పెంపొందించడంతోపాటు సమకాలిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరుచుకోవచ్చన్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఈ.సాయిబాబా రెడ్డి మాట్లాడారు. ముగింపు సందర్భంగా పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రోఛాన్సలర్ చొప్పా అభిషేక్ రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లికార్జున రావు, కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, బి.జయరామిరెడ్డి, డీన్ డాక్టర్ ఎం.సుబ్బారావు, పరిపాలన అధికారి ఎస్.సుబ్బారెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కారులో మంటలు.. వ్యక్తికి తీవ్ర గాయాలు



దగ్ధమవుతున్న కారు



గాయపడిన మన్సూరు అలీ

వీరబల్లి : మండలంలోని షికారుపాలెం వద్ద గురువారం రాత్రి 8 గంటల సమయంలో కారు దగ్ధం కావడంతో అందులోని వ్యక్తికి గాయాలయ్యాయి. రాయచోటి పట్టణంలోని బీరం సాబ్ వీధికి చెందిన మన్సూరు అలీ (53) రాజంపేట నుంచి రాయచోటికి కారులో వస్తుండగా షికారుపాలెం వద్ద ఉన్న మలుపువద్ద అదుపు తప్పడంతో కారు పల్టీలు కొట్టుకుంటూ రోడ్డు పక్కన పడిపోయింది. మంటలు చెలరేగడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ వరప్రసాద్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన మన్సూరు అలినీ రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు సమాచారం.

గిట్టుబాటు ధర కరువై.. అప్పులు భారమై.!

- దళారుల సిండికేట్‌తో దగాపడుతున్న రైతులు
- వందలాది ఎకరాల్లో దోస, కర్బూజ పంటను వదిలేస్తున్న వైనం
- గుండెపోటుతో దోస రైతు మృతి
- పట్టించుకోని ప్రభుత్వం





రైతు రామ జనార్దన్ (ఫైల్), భర్త మృతితో రోదిస్తున్న భార్య సులోచన, కుమార్తె



తోటలోనే వదిలేసిన కర్బూజా కాయలు

ఓబులవారిపల్లె : తొలి నుంచి రైల్వేకోడూరు నియోజకవర్గం ఉద్యాన పంటలకు ప్రసిద్ధి. అయితే తక్కువ వ్యవధిలో ఆదాయం వస్తుండడంతో దశాబ్ద కాలంగా కర్బూజ, దోస పంటలను రైతులు సాగు చేస్తున్నారు. లక్షలు ఖర్చుపెట్టి అప్పుచేసి పంట సాగు చేస్తే చేతికి అందే సమయంలో దళారుల సిండికేట్‌తో అమ్ముడుపోక తోటలోనే కాయలు వదిలేసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఫలితంగా అప్పుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో గిట్టుబాటు ధర లేక కలత చెంది ఓ రైతు గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు ఇలా..

మండలంలోని వై.కోట గ్రామానికి చెందిన రామ జనార్దన్ (49) అనే రైతు సాగు చేస్తున్న దోస, కర్బూజ పంటలో తీవ్రంగా నష్టం రావడంతో కలత చెంది గుండెపోటుతో ఈనెల 4వ తేదీ మృతి చెందాడు. వ్యవసాయమే ఆధారంగా అప్పులు చేసి తనకున్న పది ఎకరాలలో అంతర పంటగా దోస, కర్బూజను సాగు చేశాడు. దళారులు సిండికేట్‌గా మారి టన్ను రూ. 4 వేలు నుంచి రూ. 5 వేలుగా నిర్ణయించారు. ఒక్కసారిగా ధర పడిపోవడంతో రైతు ఆందోళన చెందాడు. దళారులు రాకపోవడంతో తోటలోనే కాయలు కుళ్లిపోయే దశకు చేరుకున్నాయి. దీంతో అప్పుచేసి పెట్టుబడి పెట్టిన రూ. 10 లక్షలలో ఒక్క రూపాయి కూడా రాకపోవడంతో రోదించాడు. కాయలు తోటలోనే కుళ్లిపోగా మనస్తాపం చెంది తీవ్రంగా అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే మృతి చెందాడు. చివరకు రైతు కాయలు వదిలేసిన తోటలోనే మృతదేహాన్ని ఖననం చేశారు.

జీవనోపాధి కోల్పోయిన కుటుంబం..

రామ జనార్దన్ మృతి చెందడంతో పెద్దదిక్కు లేక వారి కుటుంబం జీవనోపాధి కోల్పోయింది. జనార్దన్‌కు భార్య సులోచన, ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. వారిలో పెద్దమ్మాయికి వివాహం కాగా, పెద్దబ్బాయి వెంకటేష్ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి మృతి చెందడంతో వెంకటేష్ చదువు చాలించి తండ్రి చేసిన అప్పులు తీర్చేందుకు వ్యవసాయం చేసేందుకు సిద్ధమయ్యాడు.

ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదు..

లక్షలు అప్పుచేసి సాగు చేసిన పంట చేతికి రాకపోవడంతో మృతి చెందిన రైతు కుటుంబాన్ని సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆదుకోవాలని నియోజకవర్గంలోని ప్రజలు కోరుతున్నారు. గిట్టుబాటు ధర లేక వందల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోతుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం నష్టపోతున్న దోస, కర్బూజ రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు .

మదనపల్లె రెవెన్యూలో లంచాల జోరు

- మ్యుటేషన్‌కు రూ.5లక్షలు తీసుకున్న వీఆర్‌ఓ
- అధికారికి కేవలం రూ.20 వేలు అప్పగింత
- వాట్సప్ గ్రూపుల్లో హల్‌చల్, దిద్దుబాటలో అధికారులు



మదనపల్లె తహసీల్దార్ కార్యాలయం

మదనపల్లె : మండల తహసీల్దార్ కార్యాలయంలో లంచాల జోరు కొనసాగుతోంది. భూమి ఆన్‌లైన్ చేయించడం, పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయడం, మ్యుటేషన్ తదితర సేవలకు సంబంధించి పెద్ద మొత్తంలో లంచాలు తీసుకుంటున్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. తాజాగా బుధవారం మండలంలోని బీకే.పల్లె పంచాయతీలో ఓ సర్వే నెంబర్‌లో మ్యుటేషన్‌కు సంబంధించిన వ్యవహారంలో ఆ పంచాయతీకి సంబంధం లేని వీఆర్‌ఓ రూ.5లక్షలు తీసుకుని, అధికారికి మాత్రం కేవలం 20 వేలు ఇచ్చాడని, తహసీల్దార్ కార్యాలయంలో సదరు వీఆర్‌ఓ అవినీతి, అక్రమాలకు అడ్డే లేదంటూ పట్టణానికి చెందిన వాట్సప్ గ్రూపుల్లో మెసేజ్ వైరల్ అయింది. దీంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమై జరిగిన పొరపాటును దిద్దుబాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. గురువారం మెసేజ్ వైరల్ విషయమై తహసీల్దార్ కార్యాలయానికి వెళితే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. బీకే.పల్లె పంచాయతీకి మస్తాన్, ప్రసాద్‌లు వీఆర్‌ఓలుగా ఉన్నారు. వీరి పంచాయతీలోని సర్వే నెంబర్.448లోని 5.02 ఎకరాల భూమిని భాగ పరిష్కారాల్లో భాగంగా సానక వెంకటరమణారెడ్డి, సానక నాగరాజారెడ్డి, సానక సుధాకర్‌రెడ్డిల పేరుపై మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించి వారు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన సమయంలో...వేరే పంచాయతీకి చెందిన వీఆర్‌ఓ వారితో మాటలు కలిపాడు. తహసీల్దార్ కొత్తగా వచ్చారని, ఇప్పుడిప్పుడే మ్యుటేషన్లు చేయడం లేదని, మీకు అత్యవసరమైతే తాను ఎలాగోలా నచ్చజెప్పి చేయిస్తానని ఐదు లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. 15 రోజులకు ముందు ఒకరిపేరుమీద, బుధవారం రోజు మరొకరి పేరు మీద మ్యుటేషన్ జరిగింది. అయితే బీకే.పల్లె పంచాయతీకి చెందిన వీఆర్‌ఓలు తమ పరిధిలో మ్యుటేషన్‌కు తమతో సంబంధం లేకుండానే వేరే పంచాయతీకి చెందిన వీఆర్‌ఓతో చేయించుకోవడంపై రైతులను ప్రశ్నించారు. దీంతో వారు అసలు విషయం బయటపెట్టడంతో లంచం విషయం వెలుగులోకి వచ్చింది. ఇది కాస్తా ఆ నోటా ఈ నోటా పాకి గ్రూపుల వరకు చేరింది. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందిని ఎవరిని కదిలించినా, ఈ విషయంపైనే మాట్లాడుకుంటున్నారు. ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించిన వీఆర్‌ఓ గతంలో పనిచేసిన తహసీల్దార్‌లను ఇలాగే వాడుకున్నాడని, ఓ తహసీల్దార్ అతడిని వద్దని సరెండర్ చేస్తే, మంత్రి వద్దకు వెళ్లి పలుకుబడి ఉపయోగించి మరీ పోస్టింగ్ తెచ్చుకున్నాడని చెప్పుకుంటున్నారు. చాలాకాలంగా మదనపల్లె మండలంలోనే పనిచేస్తూ, కోట్లకు పడగలెత్తాడని రెవెన్యూ సిబ్బంది బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి మహిళ ఆత్మహత్య

తిరుపతి క్రైమ్ : అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం తిరుపతిలో జరిగింది. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కెనడి నగర్ లోని పద్మావతి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వెంకటేష్ తో రాజంపేటకు చెందిన గౌతమికి వివాహమైంది. వెంకటేష్ మెడికల్ రెప్రజెంటేటివ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం వెంకటేష్ విధులకు వెళ్లాడు. వారి కుమార్తె పాఠశాలకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గౌతమి మూడో అంతస్తు నుంచి కిందకు దూకేసింది. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. అయితే తండ్రి సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఇదిలా ఉంటే గౌతమికి గత కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేదని అందువల్లే ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు ప్రాథమిక విచారణలో నిర్ధారించారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యా యత్నం

మదనపల్లె సిటీ : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యకు యత్నించిన సంఘటనలు గురువారం జరిగాయి. రామసముద్రం మండలం జంగాలపల్లెకు చెందిన మురళి (27) ఆలయ పూజారిగా జీవనం సాగిస్తున్నారు. అప్పులు ఎక్కువ కావడం, రుణగ్రహీతలు ఒత్తిడి చేయడంతో ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంటడంతో తిరుపతికి రెఫర్ చేశారు. చిత్తూరు జిల్లా చౌడేపల్లెకు చెందిన హరి(28) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. జీవనం కోసం సుమారు రూ.9 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చాలని రుణగ్రహీతలు ఒత్తిడి చేశారు. దీంతో ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం క్రిష్ణాపురానికి చెందిన ఓ బాలిక (9) బుధవారం రాత్రి ఇంట్లోని గదిలో గడియ పెట్టుకుని పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతికి రెఫర్ చేశారు. సంబంధిత పోలీసు స్టేషన్లలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.